'పల్లె'వించిన భరోసా

- రైతు భరోసా కేంద్రాలతో గ్రామాల్లోనే సేవలు
- రైతులకు తప్పిన వ్యయప్రయాసలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

నందవరం: ఒకప్పుడు రైతులు ఏది కావాలన్నా పట్టణాలకు పరుగులు పెటాల్సి వచ్చేది. ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. డీలర్లు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ప్రస్తుతం ఆ కష్టాలన్నింటికీ ప్రభుత్వం చెక్ పెట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతులకు సేవలందించేలా రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. దీంతో ఉన్న ఊరిలోనే రైతన్నలకు సేవలందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. ఆర్బీకే సిబ్బంది మట్టి నమూనాల సేకరణ నుంచి దిగుబడులు విక్రయించుకునే వరకు రైతులకు అండగా నిలుస్తున్నారు. పంటల సాగు సలహాలతో పాటు ప్రభుత్వ పథకాలపై రైతులను చైతన్య పరుస్తున్నారు. ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల సేవలపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతు తనకు ఏ ఎరువులు కావాలో స్వయంగా ఆర్డర్ పెట్టుకునేలా డిజిటల్ కియోస్క్ సేవలు అందుబాటులోకి రావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 65 ఆర్బీకేలను ఏర్పాటుచేయగా వాటిపరిధిలో 44,661 మంది రైతులు ఉన్నారు. నందవరం మండలంలో 42,875 మంది, గోనెగండ్లలో 16,401 మంది, ఎమ్మిగనూరు మండలంలో 15,703 మంది రైతులు ఉన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిన రైతులు నియోజకవర్గంలో 39,200 మంది ఉన్నారు. ఏటా ఖరీఫ్‌లో 1,47,990 ఎకరాల సాగు జరుగుతుంది.

ఆర్బీకేల ద్వారా ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంటల సమాచారం. ఆన్‌లైన్‌లో పంటల నమోదు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ధరలు, ఆధునిక సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం అందిస్తున్నారు. అలాగే కౌలుకు భూమిని సాగు చేసుకునే రైతులకు యాజమాన్య రైతుల అభిప్రాయంతో కౌలు రైతు కార్డులు జారీ చేయనున్నారు. ఆర్బీకేలలో సబ్సిడీ ధరలకు వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. సబ్సిడీ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, రోటవేటర్‌లు, స్ప్రేయర్ పంపులు తదితర వాటిని ఆర్బీకేలకు దరఖాస్తు చేసుకుని పొందవచ్చును. దీంతో పాటు రైతుల సంక్షేమం కోసం ఏటా పెట్టుబడి సాయం కింద రైతు భరోసా, పంట బీమా, పంట రుణాలు, తదితర పథకాలు రైతుల చెంతకే చేరుతున్నాయి.

- నియోజకవర్గంలో 65 ఆర్బీకేలుండగా ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.21.80 లక్షల ప్రకారం, మొత్తం రూ.14.17 కోట్లు విడుదల చేసింది.
- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా నాలుగో విడతలో 39,200 మంది రైతుల ఖాతాలో నగదు జమ చేశారు. నాలుగేళ్లలో రూ.117.60 కోట్లు జమ చేశారు.
- వైఎస్సార్ యంత్ర సేవా ద్వారా నియోజకవర్గంలో 65 సీహెచ్‌సీ గ్రూపులు లబ్ధి పొందుతున్నాయి. అందులో 325 రైతులకు వివిధ రకాల పనిముట్లు, యంత్రాలు పంపిణీ చేశారు. అందుకు గానూ ప్రభుత్వం రూ.9.75 కోట్లు విలువ చేసే యంత్రాలు మంజూరు చేసింది. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ రూ.2.43 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఒక ట్రాక్టర్‌పై సబ్సిడీ రూ.2,98,280, ఒక డ్రైవాన్ స్ప్రేయర్‌పై రూ. 8 వేలు, కాటన్ సీడర్ రూ.54 వేలు, రోటావేటర్‌పై రూ.35 వేల చొప్పున ప్రభుత్వం రైతు గ్రూపులకు అందించింది.
- భూసార పరీక్షల నిమిత్తం ఒక్కో ఆర్బీకే పరిధిలో 22 షాంపిల్స్ చొప్పున 65 ఆర్బీకేల పరిధిలో 1,430 షాంపిల్స్‌ను సేకరించి ఎమ్మిగనూరు ల్యాబ్‌కు పంపించారు.
- నియోజకవర్గంలో 420 క్వింటాళ్ల వేరుశనగ, 56 క్వింటాళ్ల పిల్లిపెసర, 80 క్వింటాళ్ల జీలుగ కేటాయించారు. రైతులకు 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు.
- 1450 మెట్రిక్ టన్నుల యూరియా అండ్ కాంప్లెక్స్ ఎరువులు ఆర్బీకేలలో అందుబాటులో ఉంచారు.


భూసార పరీక్షల నిమిత్తం మట్టి శ్యాంపిల్ సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది


రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

మండలాల వారీగా రైతులు, ఖరీఫ్ సాగు, రైతు భరోసా వివరాలు..

మండలం	ఆర్బీకేలు	రైతులు	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)	మంజూరైన రైతు భరోసా (రూ.కోట్లలో)
నందవరం	19	13,035	42,875	రూ. 7,16,92,500
గోనెగండ్ల	23	12,499	53,377	రూ. 6,87,44,500
ఎమ్మిగనూరు	23	13,666	51,738	రూ. 7,51,63,000
మొత్తం	65	39,200	1,47,990	రూ. 21,56,00,000

ఇబ్బందులు తొలగాయి



గతంలో సబ్సిడీ విత్తనాలు పొందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పనులు మానుకుని వ్యయ ప్రయాసల కోర్చి ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. నేడు ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. గ్రామంలోనే ఆర్బీకే కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. విత్తనాల కోసం ఎదురు చూడకుండా ముందుగానే అందిస్తున్నారు.

– భాస్కరరెడ్డి, రైతు, గోనెగండ్ల

గ్రామంలో అన్నీ దొరుకుతున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు లేకుండా గ్రామంలోనే ఆర్బీకే ఏర్పాటు చేశారు. ఏటా ఖరీఫ్ సాగుకు ముందుగా గ్రామంలో వేరుశన గ, పిల్లిపెసర, జీలుగ, ఎరువులు వచ్చాయి. చాలా సంతోషకరంగా ఉంది. పెట్టుబడి సాయం కింద వైఎస్సార్ రైతు భరోసా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. రైతుల కష్టాలు గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలు గొప్పగా ఉన్నాయి. –పంపయ్య గౌడ్, రైతు, నందవరం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఆర్‌బీకేలో రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నాం.. ప్రతి ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారు. రైతులు వ్యవసాయానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా ఆర్బీకేలకు వెళ్లి సేవలు పొందవచ్చు. విత్తనాలు సాగు చేసుకు నే నాటి నుంచి పంట దిగుబడి అమ్ముకునే వరకు పంటల సాగులో సలహాలు సూచనలు పొందవ చ్చు.రైతులు అర్‌బీకేసేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– మహమ్మద్ ఖాద్రి, ఏడీఏ, ఎమ్మిగనూరు

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

వెల్దుర్తి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య, సౌకర్యాలు అందుతున్నాయని ఎంఈఓ–2 రమేశ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. స్థానిక హరిజనవాడ ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం సరస్వతి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎంఈఓ–2 మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థులకు అందిస్తున్న పథకాలను వివరించారు. పీఎంసీ చైర్మన్ ఎల్లరాముడు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మద్దికెర: అట్టడుగున ఉన్న గ్రామీణ కుటుంబాలకు సాధికారత కల్పించేందుకు సంగతస్ సే సమృద్ధి అనే ప్రచారాన్ని తీసుకొచ్చిందని వైకేపీ ఏపీఎం మధుబాబు అన్నారు. సోమవారం మద్దికెరలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన మహిళలందరినీ స్వయం సహాయక బృందాల్లో చేర్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

దంపతులకు గాయాలు

వెల్దుర్తి: పట్టణ పరిధిలోని హైవే–44పై సోమవారం ముందు నిలిపిన బైక్‌ను మోటార్‌సైకిల్ (లూనా) ఢీకొన్న సంఘటనలో లూనాపై ఉన్న భార్యభర్తలు కిందపడి గాయపడ్డారు. కృష్ణగిరి మండలం పుట్లూరు గ్రామానికి చెందిన జనార్దన రెడ్డి భార్యతో కలిసి వెల్దుర్తిలో బ్యాంకు పని నిమిత్తం మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. చెరుకులపాడు క్రాస్ వద్ద హైవే పైకి చేరుకున్నాడు. ముందుగా నిలిపిఉంచిన బైక్‌ను గమనించకుండా ఢీకొట్టారు. మోటార్‌సైకిల్ నుంచి కిందపడి జనార్దనరెడ్డికి తీవ్ర గాయాలు కాగా భార్యభర్తలను హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన విజయ్ అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఘటనపై సోమవారం ఏఓ రవి, వీఆర్వో రంగస్వామి గ్రామంలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, సర్పంచ్ విజయుడు ఏఈఓ అనూష, సిబ్బంది దామోదర్ ఉన్నారు.

వేగవంతం చేయండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ డీఈఈ చంద్రశేఖర్ ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో గ్రామ సచివాలయ స్లాబ్ పనులను పీఆర్ ఏఈ జయన్నతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్‌క్లినిక్ సెంటర్లు, పాల శీతలీకరణ కేంద్రాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత, సకాలంలో పూర్తి చేయడంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

నందవరం: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, సాగు సాయం కింద ప్రభుత్వం రూ.10 వేలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరుతూ దశల వారీగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జులై 3న గ్రామ సచివాలయాల వద్ద, 10, 11వ తేదీల్లో మండల కేంద్రాల వద్ద దీక్షలు చేయనున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నందవరం: స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలను సచివాలయ సిబ్బంది త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహించరాదని, సమస్యలుంటే తమ దృష్టికి తీసురావాలని వెంటనే పరిష్కరిస్తాన్నారు. డీటీ రఘువీర, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య,వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, సీ హెచ్‌ఓ బలరాం,పీఆర్ఏఈ జయన్న పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

హాలహర్వి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగేంద్ర హెచ్చరించారు. సోమవారం నిట్రవట్టి గ్రామంలో ఆయన ప్రజలతో మాట్లాడారు.గ్రామంలో మట్కా, పేకాట, నాటు సారా, కర్ణాటక మద్యం సరఫరా, విక్రయాలు తదితర అసాంఘిక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, చిన్నచిన్న విషయాలకే గొడవలు పడి స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హాలిగేర రోడ్డుకు మహర్దశ

ఆస్పరి: మండలంలోని హాలిగేర బీటీ రోడ్డుకు మహర్దశ వచ్చింది. ఆదోని రోడ్డు నుంచి 4 కి.మీ దూరంలో ఉన్న హాలిగేర బీటీ రోడ్డు మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం రూ.45 లక్షలు, హాలిగేర గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కంచెమ్మవ్వ ఆలయం వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల కోసం రూ.20 లక్షలు మంజూరు చేసింది. గతంలో ఈ రోడ్డులో గుంతలు పడి వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హాలిగేరకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు బీటీ రోడ్డు మరమ్మతు పనులు, సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. అధికారులు బీటీ రోడ్డుపై ఉన్న తారును జేసీబీతో పూర్తిగా తొలగించి, గుంతల్లో కంకర వేసి పనులు చేస్తున్నారు. గ్రామంలో కూడా డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. పనులను త్వరలోనే పూర్తి చేస్తామని పంచాయితీరాజ్ ఏఈ యమునప్ప తెలిపారు.


హాలిగేర రోడ్డులో జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

సీఎం జగనన్నకు కృతజ్ఞతలు

పత్తికొండ రూరల్: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాల్లో ధూప దీప నైవేద్యం పథకం వర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కమ్మర హరికృష్ణ, శంకరయ్యాచారి, బ్రహ్మయ్యాచారి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన జీఓ కాపీలను ప్రదర్శిస్తూ ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షం ప్రకటించారు. సంఘం నాయకులు పరమేష్‌ఆచారి, మహానంది ఆచారి తదితరులు పాల్గొన్నారు.


దేవదాయ శాఖ జారీ చేసిన జీఓ కాపీలను ప్రదర్శిస్తున్న విశ్వబ్రాహ్మణులు

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆస్పరి: ఈనెల 29న బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ వరప్రసాద్ సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలుగుతూ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

చిప్పగిరి: స్థానిక కస్తూర్బా పాఠశాలను సోమవారం ఎంఈఓ బాలనాయుడు తనిఖీ చేశారు. పాఠశాలలో భోజన వసతి, విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈ–కేవైసీ చేయించుకోండి

హాలహర్వి: నెల 27వ తేదీలోపు అమ్మ ఒడి పథకానికి సంబంధించిన లబ్ధిదారులు (విద్యార్థుల తల్లులు) ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంఈఓ ఈరన్న సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఈ–కేవైసీ చేయించుకోని వారి ఖాతాల్లో నగదు జమ కాదని చెప్పారు. వివరాలకు స్థానిక సచివాలయాలను సంప్రదించాలన్నారు.

పీఎం కిసాన్‌కు 30 వరకు గడువు


హాలహర్వి: పీఎం కిసాన్ పథకానికి ఈనెల 30వ తేదీలోపు ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ శివశంకర్ రైతులకు సూచించారు. ఆయన సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఈ–కేవైసీ నమోదు చేయించుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ కింద నగదు ఖాతాలో జమ అవుతుందన్నారు. ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాలో రూ.5,500 నగదు జమ అయ్యిందని వీటిని పంట పెట్టుబడులకు వినియోగించుకోవాలని సూచించారు.

పశు బీమా పాడి రైతులకు వరం

తుగ్గలి: వైఎస్సార్ పశు బీమా పథకం పాడి రైతులకు వరం వంటిదని పశు వైద్యాధికారిణి ప్రణీత అన్నారు. సోమవారం ఆమె స్థానిక పశు వైద్యశాలలో మాట్లాడుతూ.. పశువులకు మూడేళ్ల కాలానికి కేవలం రూ.384 చెల్లించి బీమా పొందాలన్నారు. పశువు మరణిస్తే రూ.30 వేలు పరిహారం అందుతుందన్నారు. గొర్రెలు, మేకలకు ఏడాది రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చెల్లిస్తే మరణించిన ఒక్కో జీవానికి రూ.6 వేలు పరిహారం దక్కుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు, జీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

హొళగుంద: ఆదోని డిపో నుంచి హొళగుందతో పాటు వివిధ గ్రామాలకు రద్దు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులు, విద్యార్థి బస్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రూట్ సర్వేకు వచ్చిన ఆదోని ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీఎం అమర్నాథ్‌ను ఆదోని, ఆలూరు కూడలిలోని జూనియర్ కాలేజ్ వద్ద అడ్డుకుని నిలదీశారు. అక్కడే రోడ్డుపై బైఠాయించడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎంపీటీసీలు మల్లికార్జున, శివన్న, మల్లయ్య తదితరులతో పాటు గ్రామస్తులు ఇన్‌చార్జ్ డీఎం, అసిస్టెంట్ డీఎంతో వాగ్వాదానికి దిగారు. బస్సుల రద్దు, రూటు మార్పు కారణంగా ప్రజలు, విద్యార్థులు పడుతున్న అవస్థలను వివరించారు. సమస్యను నాయకులు మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మంగళవారం నుంచి యథావిధిగా బస్సులు నడుపుతామని ఇన్‌చార్జ్ డీఎం హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదోని ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీఎం

మత్తుకు బానిసైతే జీవితం ఛిద్రం

ఎమ్మిగనూరు టౌన్: మాదక ద్రవ్యాలతో అనర్థాలు తప్పవని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని డీఎస్పీ సీతారామయ్య సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో పోలీసు శాఖ, సెబ్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడగా డీఎస్పీ వారిచే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్ రావు, మోహన్ రెడ్డి, సెబ్ సీఐ జయరాంనాయుడు, పెద్దకడబూర్ ఎస్‌ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మాధక ద్రవ్యాల నిరోధానికి ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా పనిచేయాలని వెల్దుర్తి సీఐ యుగంధర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఆల్కహాల్, మాదక ద్రవ్యాలు, బీడీ, సిగిరెట్ల మత్తుకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై ఉన్నతాధికారులకు లేదా 14500 నంబరుకు కాల్ చేసి సమాచారం తెలపాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మద్దికెర : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎస్‌ఐ రిజ్వాన్ సూచించారు. స్థానిక విద్యాసాయి కళాశాల విద్యార్థులతో మత్తు పదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు సూచనలు చేశారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జూనియర్ సివిల్ జడ్జి కె.గురుఅరవింద్ పేర్కొన్నారు. సోమవారం ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ మోహన్ రెడ్డి సూచించారు. సోమవారం గోనెగండ్లలో ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులచే మత్తు పదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మురళీమోహన్, ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ సీతారామయ్య

తుగ్గలి వైద్యాధికారిణిగా జి.ప్రతిమ



తుగ్గలి: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా నియమించబడ్డ డాక్టర్ జి.ప్రతిమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ద్రాక్షాయణి సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి నియమించబడ్డారు. ఆమె స్థానంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటి మండలం మోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యాధికారిణి డాక్టర్ జి.ప్రతిమ ఇక్కడికి నియమించబడ్డారు. నూతన వైద్యాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జి.ప్రతిమను డీడీఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది స్వాగతించారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

గోనెగండ్ల: మండలంలో ఖాళీగా ఉన్న 5 వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. పెద్దనేలటూర్‌లో 3, గోనెగండ్లలో 1, వేముగోడులో 1 చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీ ఉండగా 9 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇంటర్వ్యూలకు 7 మంది హాజరయ్యారు. అర్హులైన వారిని వలంటీర్లుగా ఎంపిక చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. సూపరింటెండెంట్ బాబు భాస్కర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలకు అభినందన

తుగ్గలి: ఆర్ఎస్ పెండేకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీలలో కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన శ్రీ నరసింహ మెమోరియల్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచారు. తమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ పట్ల హెచ్‌ఎం నరేంద్రప్రసాద్ సోమవారం అభినందన సభ నిర్వహించారు. క్రీడాకారులు, పీడీ పాండురంగరాజును అభినందించారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టును 8 టీఎంసీలతో నిర్మించి ఆస్పరి మండలానికి తాగు, సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని బిల్లేకల్లు నుంచి ఆస్పరి వరకు చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి పిలుపునిచ్చారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

ఆలూరు రూరల్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఆలూరు ఎంఈఓలు రామాంజినేయులు, చిరంజీవి రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర–2 పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జగనన్న విద్యాకానుక కిట్లను వంద శాతం పంపిణీ చేయాలని, ఆగస్టు చివరి నాటికి నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని, జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. అమ్మ ఒడి పథకానికి సంబంధించి ఈ–కేవైసీ పూర్తిచేయాలని సూచించారు. మండలంలోని 53 పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి

హుండీ పగులగొట్టి చోరీ

ఆలూరు: దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామ సమీపంలో ఉన్న కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీని పెకలించి నగదు దోచుకెళ్లారు. సీసీ పుటేజీలు ధ్వంసం చేశారు. హుండీలో దాదాపు రూ.లక్ష నగదు, వెండి ఆభరణాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఘటనపై సోమవారం ఆలయ అర్చకులు, భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ ఎస్‌ఐ భూపాలుడు వెల్లడించారు.


కౌలుట్ల ఆలయంలో హుండీ పగులగొట్టిన దృశ్యం

కారు బోల్తా: ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు మంత్రి సాయం

ఆలూరు/దేవనకొండ: మండల పరిధిలోని ఈదుల దేవరబండ సమీపాన టైరు పగలడంతో కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మద్దికెరకు చెందిన నెట్టికంటి చంద్రశేఖర్, తల్లి బజారమ్మకు అనారోగ్యం కారణంగా భార్య ప్రభావతితో కలిసి మద్దికెర నుంచి కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఈదుల దేవరబండ వద్ద కారు టైరు పగలడంతో అదుపుతప్పి పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. ప్రమాదంలో ప్రభావతి (32) అక్కడికక్కడే మరణించగా చంద్రశేఖర్, బజారమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు చిల్లచెలిమల గ్రామానికి వెళ్తున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మ నూరు జయరాం, సోదరులు నారాయణస్వామి, శ్రీని వాసులు, దేవనకొండ మండల నాయకులు క్షతగా త్రులను అంబులెన్స్‌లో ఎక్కించి ఆస్పత్రికి పంపారు. వారి వెంట తెర్నకల్ సర్పంచ్ అరుణకుమార్‌ను పంపి ఆతర్వాత కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. మంత్రి స్పందించిన తీరును ప్రజలు అభినందించారు.


సీపీఆర్ చేస్తున్న దృశ్యం

వ్యవసాయంలో మెలకువలు పాటించాలి

కృష్ణగిరి: వ్యవసాయంలో మెలకువలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలని ఏఓ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో వ్యవసాయంపై ఆధారపడి 85 శాతం మంది ప్రజలు జీవిస్తున్నారని, పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల్లో రైతులు పాల్గొని వారి సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే అక్కడిక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అవసరమైన వారు తమను సంప్రదించాల సూచించారు.